కథానిక

# జేబు దొంగలు: తోడు దొంగలు

ఓగేటి శివరామకృష్ణ

విశ్వాసరావుకు పుట్టుకనుంచీ డబ్బు జాగ్రత్తగా వాడుకోవటం తెలియదు. ఆ సంగతి అట్లా వదిలెయ్యండి. జేబులో యెంత డబ్బు ఉన్నదో యెంత డబ్బు వేసుకున్నాడో, యెంత ఖర్చు పెట్టాడో, మరి యెంత డబ్బు నిలువ వుంటుందో యెప్పుడూ లెక్క చూసుకొన్న పాపాన పోలేదు. చదువుకొనే రోజుల్లో అది గమనించిన స్నేహితులు ఒకరిద్దరు విశ్వాసరావుకు చెప్పటం జరిగింది. కాని అది తన దర్జాతనానికి దెబ్బ అనుకొన్నట్లుగా "మన డబ్బయితే మనదగ్గరే ఉంటుంది మరొకళ్ళదగ్గర కెందుకు వెళ్ళుతుంది? ఎప్పుడైతే మరొకళ్ళ చేతులో పడిందో అప్పుడా డబ్బు మనది కాదన్న మాటే"—అన్నాడు.

చదువుదగ్గర్నుంచీ పెరిగిన యీ దర్జాతనం అనండి, తెలివితక్కువతనం అనండి... ఉద్యోగంలో ప్రవేశించేసరికి మరింత అభివృద్ధి పొందింది. ఎప్పుడూ చేతినిండా డబ్బు మసలుతూండటంవల్ల——ఖర్చు విషయంలోగాని, డబ్బు విషయంలోగాని, వెనక్కి తిరిగి విశ్వాసరావు చూసుకొనవలసిన అవసరం లేకపోయింది. దానికి తోడు అతనిది హోదా అయిన ఉద్యోగం. విశ్వాసరావు ఉద్యోగంలో ప్రవేశించేసరికి ఇంకా భార్య కాపురానికి రాలేదు. అందువల్ల హోటలు మెతుకులు కతుకుతూ ఒంటరిగా ఉంటూ బ్రహ్మచర్యం గడపవలసి వచ్చింది. ఈ కాలంలో బట్టలు యిస్త్రీ చేయటానికి — ఒక మనిషిని మాట్లాడుకొన్నాడు.

ఆ చాకలి వారంరోజుల కొకసూరు వచ్చి, బట్టలు తీసుకుపోయి, యిస్త్రీచేసి తెస్తూండేవాడు. రోజులు గడిచినకొద్దీ విశ్వాసరావుకు ఆచాకలిమీద మంచి నమ్మకం యేర్పడ్డది. దర్జాకు బట్టలు తిరిగి లెక్క చూసుకోవటం లోటుగా యెంచే విశ్వాసరావుకు ఒక సంఘటన మంచి నమ్మకం కలిగించింది. చాకలి ఒకమారు పొరపాటున ఉండిపోయిన ఆఫీసు కాగితాలూ, రెండు రూపాయల నోట్లూ బట్టలోంచి తీసియిచ్చాడు. దొరికినప్పుడు కొట్టేయకుండా యిచ్చినందుకు అతనెంతో సంతోషించి చాకలిని అభినందించాడు.

వాడా సమయంలో అన్నాడు: "అన్యాయంగా ఒకళ్ళ సొమ్ము తింటే బాగుపడతామా బాబయ్యా! భగవంతుడు మాకింత యివ్వాలి. మేం తినాలి. మేం కష్టపడ్డదానికి మీరు యిస్తున్నప్పుడు అన్యాయపు సొమ్ము పుచ్చుకుంటే మాకు జీర్ణమవుతుందా బాబయ్యా!" అని.

"అవున్లేవోయ్" అని విశ్వాసరావా చాకలిని మెచ్చుకొన్నాడు. అప్పటినుంచీ, ఆ చాకలిమీద విశ్వాసరావుకు నమ్మకం కలిగింది. జేబులో ఏమైనా ఉన్నపక్షంలో తప్పక యిస్తాడనే ఉద్దేశం అతడికి స్థిరంగా నాటుకుపోయింది. ఆ ఉద్దేశంతో మరిచి విడిచిన బట్టలను చూడటంగాని పద్దువేయటంగాని మానుకున్నాడు. చాకలిమీద అతడికింత నమ్మకం కుదిరింది.

తర్వాత,తర్వాత, విశ్వాసరావు వస్తువులెన్నో పోయాయి. రెండు పదిరూపాయల నోట్లు, ఒక స్వాన్ కలం, ప్రెస్‌బటన్సు—యిలాంటి వెన్నో.

బట్టలుపడే సమయానికి విశ్వాసరావుకు జ్ఞప్తి యందుండేదికాదు. తర్వాత ఎలాగో కొంచెం జ్ఞాపకం వచ్చేది. తన దర్జాకు లోపం అని ఒకటి రెండుమార్లు ఊరుకుండటం జరిపాడు; కానీ రెండుపదులు పోయిన సమయంలో మాత్రం ఆత్మాభిమానం ఎలాగో దూరంగా నెట్టి, వాడిని అడిగాడు. "అదేమిటి బాబయ్యా! నాకు నాకు తెలియదండి! అన్యాయపు సొమ్ము నాకు దక్కుతుందిటండీ. ఇదివరకు తమరివ్వమంటేనే యిచ్చానా బాబూ" అని మొసలికన్నీళ్లు వాడు

పెట్టడంతో "ఊరికే అన్నానోయ్-మరేం మన స్సులో పెట్టుకోకు" అని విశ్వాసరావనటం జరిగింది!

అదేవిధంగా పెన్నూ, (పెన్సు, బటన్సు యిత్యాది. మరొక సంఘటన ఆ చాకలిమీద నమ్మకం ధృఢంచేసింది. చాకలి బట్టలు తీసుకు పోయాడు. తానిదివరకు విధంగానే చూసుకోన కుండా బట్టలు వేసాడు. తీరా వాడు వెళ్ళిన ఒకగంట, తానాఫీసుకు వెళ్ళబోతూంటే హఠాత్తుగా జ్ఞాపకంవచ్చింది. తాను చాకలికి వేసిన కోటుజేబులో ఆఫీసు కాగితం ఒకటి పెట్టాడు. ఆ కాగితంలో అంకెలు తయారుచేయ డానికి నిద్రాహారాలు మాని పనిచేస్తే వారం రోజులు పట్టింది. అలాంటి కాగితం చాకలిదేవుడి హస్తగతం అయిపోయింది.

విశ్వాసరావు హడావిడిపడుతూ, సైకిలుమీద వాళ్ళ యింటికి పరుగెత్తాడు. చాకలింకా బట్టల మూట విప్పి పరీక్ష చెయ్యలేదు.

విశ్వాసరావు రాక వాడికాశ్చర్యం కలిగించింది.

"ఏం బాబూ'' అన్నాడు.

విశ్వాసరావు ఖంగారుగా చెప్పాడు.

"మీసొమ్ము మాకెందుకు బాబూ!"—అని సత్యకాలంమనిషిలాగ బట్టలమూట విప్పి, విశ్వాస రావు చెప్పిన కోటుతీసి పరీక్షచేశాడు. ఆకాగితం, కాగితంతోపాటు ఒక రూపాయినోటూ పావులా డబ్బులూ, బయటపడ్డాయి.

"తీసుకోండి బాబూ!"—అని యిచ్చెయ్య బోయాడు లోపల బాధపడుతూనే చాకలి!

"నాకు కావలసిన కాగితం యిచ్చావ్-ఆ డబ్బు నీదగ్గిరే ఉంచుకో" అని వచ్చేశాడు విశ్వాస రావు.

అప్పటినుంచీ, చాకలిమీద పూర్తి విశ్వాసం విశ్వాసరావుకు కలిగింది. తనకు సంబంధించిన విష యాల్లో యేటువంటి సందేహం రానివ్వకుండా వాడికి పూర్తి స్వేచ్ఛనిచ్చాడు విశ్వాసరావు. ఏతావాతా సంగతి యేమంటే విశ్వాసరావు ఉద్యోగంలో చేరిన మొదటి ఆరుమాసాల కాలం లోనూ ఏభైరూపాయల చిల్లర జేబుల్నించి సంపాదించుకో కలిగాడు చాకలి.

అయితే ఆ ఆరుమాసాల అనంతరం కమల రావటంతోటే చాకలి ఆటంకట్టింది. ఇదివరకల్లా రెండూ, మూడూరూపాయి బిళ్ళలూ, మరేవేవో వస్తువులూ దొరుకుతూండేవి వాడికి. ఇప్పుడు కమల సర్వాధికారిణి అయింది. చాకలికి బట్ట వేసేముందు జేబులు జాగర్తగా పరిశీలించటం కాగితాలూ డబ్బులూ వస్తువులూతీసి దాస్తూండటం తానే చేసేది. ఇది విశ్వాసరావు మాత్రం గమనించలేదు.

కమల కాపురానికి రావటం ఆ చాకలికి బాధ గానే ఉంది. అయితే వాడేంచేస్తాడు? పైన ఆదాయం ఏం కన్పించలేదు. కమలమీద వాడికి పూర్తిగా కోపం ఉంది. కాని అది యేవిధంగా సాధించాలో పాపం వాడికి తెలియలేదు. అందు వల్ల లోపల బాధపడుతూన్నా పైకి అభిమాన పాత్రుడిక్రిందే ప్రవర్తించేవాడు.

అయినా మనస్సులోని బాధను వాడు మన స్సులోనే ఉంచుకో లేకపోయాడు. ఓమారు కమల బట్టలు వేస్తూ విశ్వాసరావు బట్టలన్నీ పరీక్ష చేస్తోంది. ఆ సమయంలో అతడింట్లోలేడు.

"ఎందుకమ్మా మీకాశ్రమ. చాకలి పుట్టుక పుట్టినవాళ్ళం మేం భాగ్యవంతులై పుట్టి మీకా అవస్థ ఎందుకుతల్లీ! ఈలా పడెయ్యండి! నే జాగర్తగా చూస్తాను" అన్నాడు వాడు.

"అది కాదోయ్. జేబులో అయ్యగారి కాగి తాలు వగైరాలేమైనా ఉంటాయని"—అంది కమల.

"వాటి సంగతే మీకు మనవిచేసేది. నే చూస్తాగా అమ్మా! అయ్యగారికి నామీద పూర్తి నమ్మకం. మీరు రానంతవరకూ అయ్యగారి బట్ట లన్నీ నేనే పరీక్ష చేసేవాడిని" అన్నాడు వాడు.

కమల ఓసంగతి గ్రహించకలిగింది. భర్త జేబులు పరీక్ష చెయ్యడానికి వాడెందుకు అంత ఆదుర్దా చూపిస్తున్నాడో తనకూ తెలుసు. ఆయన గారు ఉద్యోగం ప్రారంభించింది లగాయితూ, ఈ ప్రేమపాత్రుడు జేబులు తనిఖీచేసి ఆర్జన ఆర్జిస్తున్నాడన్న మాట. భర్త తరహా ఆమెకు పూర్తిగా తెలుసు—అంతేకాదు, తాను వచ్చిన యీ కొద్దికాలంలోనూ తానూ యేదోమాత్రం కూడబెట్టింది కదా! ఇక సరేసరి, ఇద్దరికిద్దరే! జేబుదొంగలూ తోడుదొంగలూను.

వాడయితే ఆమాటలన్నాడు కాని, కమల మాత్రం పరీక్షచేయటం, జేబుల్లో కాగితాలు

తీయటం పడలేదు. తన మాటకు విలువ యివ్వనందుకు వాడికి కోపంగానే ఉంది. కాని యేం చేయగలడు? యజమానురాలికి తనమీద ఎలాగయినా అభిమానం కలుగుతుందేమోనని వాడే అన్నాడు "బాబుగారి సరుకు యేది దొరికినా యిచ్చేస్తూండేవాణ్ణి. కావలిస్తే మీరే కనుక్కోండి" అని తన దృష్టిలో ఉన్న రెండు దృష్టాంతరాలూ యేకరువు పెట్టాడు. కమల మనసు మారలేదు. ఎలాగయినా రుచిమరిగిన ప్రాణం గదా. ఆమె నవ్వుతూ అంది "అదికాదోయ్ నాపని నే చేయకపోతే యెట్లా! రేపు ఏవస్తువు పోయినా నన్నంటారు గదా! నీమీద నాకు పూర్తి నమ్మకం ఉంది. అయితే ఓపిక ఉన్నపుడు నీమీద ఆధారపడటం దేనికి? ఓపికలేనపుడు మరి నువ్వు ఉండనే ఉన్నావు కదా!" అని.

వాడికి మెత్తని చీవాట్లు పెట్టినట్లయింది. లోపల కమలను తిట్టుకున్నా పైకిమాత్రం "మీ యిష్టం వచ్చినట్లు కానియ్యండి" అన్నాడు.

కమల నవ్వింది.

ఈ వాగ్వాదం జరిగినప్పటినుంచీ చాకలిలో ఒక విధమైన మోటుతనం ప్రవేశించింది. "చిత్తం అమ్మా, బాబయ్యా" అనేవాడు యిప్పుడు వరుసల ప్రకారం పిలవటం మానుకున్నాడు. పైగా యేమైనా పని విశ్వాసరావు చెప్పినా "మీరిచ్చే జీతానికి పనిగూడా చేసిపెట్టాలి"అంటున్నాడు. విశ్వాసరావుకి వాడిలో మార్పుకు కారణం తెలియలేదు. "ఏమి ట్రా కొత్తగా మాట్లాడుతున్నావ్?" అన్నాడు.

"మీరిచ్చే జీతం చాలదు బాబూ! పైన యేమైనా ముట్టుతుందా అంటే అదేం కన్పించదు. మరో మూడురూకలు పెంచితేనే ఉతుకుతాను. లేకపోతే మరొకర్ని కుదుర్చుకోండి." అన్నాడు వాడు.

"జీతం పెంచమని అడగక మరి అనవసరంగా గొడవ యెందుకూ? మామూళ్ళంటున్నావ్ ఇదివరకేమైనా యిచ్చాను కనుకనా?" అన్నాడు విశ్వాసరావు.

"అదికాదండీ..."అని మరి మాట దాచేయబోయాడు వాడు.

కమలకు సంగతి తెలిసింది. ఆమెఏమీ అనలేదు కాని చాకలితత్వం పూర్తిగా అవగాహన చేసుకొని, బట్టలు వేయటంలో మరింత శ్రద్ధగా ఉండసాగింది.

* * *

ఒక ఆరు మాసాలకాలం దొర్లిపోయింది. చాకలి కోరిన మరి మూడు రూపాయలూ పోనీలే అని పెంచాడు విశ్వాసరావు జీతం పెంచినందువల్ల వాడి మొఖంలో కాంతియే యేర్పడలేదు. విసుక్కుంటూ వాడు బట్టలు తీసుకువెడ్తూనే ఉన్నాడు.

ఒకదినం విశ్వాసరావు హడావుడిగా ఆఫీసుకి పోబోతూంటే, చాకలి మామూలుగా బట్టలు తీసుకుపోదామని వచ్చాడు. "హడావుడికి తొందర మొగుడు" అని నవ్వుతూ బట్టలు వదలి, కొత్తబట్ట లేసుకొని, తనకు పట్టనట్లుగా వెళ్ళిపోయాడు విశ్వాసరావు. చాకలి చాపల్యంచేత బట్టలుతీసి జేబులు వెతకపోయాడు.

"నువ్వు ముట్టుకోనక్కర్లేదు. నేను చూసుకుంటాను" అంది కమల.

"మేం మీ యెత్తుకొని పోలేదమ్మా, గొప్పగా బయలుదేరావు. దొంగల మనుకున్నారేమిటి? అంత నమ్మకంలేకుండా ఉంటామా?"అన్నాడు చాకలి.

కమల వాడికి జవాబివ్వలేదు. చాకలి అదృష్ట వశాత్తూ జేబుల్లో డబ్బులేం దర్శనం యివ్వలేదు గాని...ఒక పొడుగాటి కాగితం మాత్రం కనిపించింది.

కమల ఆ కాగితాన్ని తనపెట్టెలో జాగ్రత్త చేసి, బట్టలు పద్దువేసి వాణ్ణి పంపింది. లోపల కమలను తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు చాకలి.

* * *

ఆఫీసుకు పోయిన విశ్వాసరావుకు పై ఆఫీసరుకు చూపాల్సిన కాగితం సంగతి జ్ఞాపకం వచ్చింది. అతడికి అలవాటేగా... పై అధికారి వచ్చే వేళయింది. ఆ కాగితం ఆయనకు చూపించి సంతకం పెట్టించాలి.

విశ్వాసరావు హడావుడిపడ్డాడు. ఆలోచించాడు. తానంతక్రితం విడిచిన కోటులో కాగితం ఉన్నదన్న సంగతి అతడికి స్ఫురణకు వచ్చింది. ఇంటివద్ద బట్టల విషయంలో జరిగిన రాద్ధాంత సిద్ధాంతా లతడికేమాత్రం తెలియవుగా. "ప్రేమపాత్రుడు"—చాకలి యిలాంటి సమయాల్లో

అతడికి దైవంతో సమానుడు. ఆఫీసు ప్యూనును పంపటంకంటె తనకుతాను బయలుదేరి వెళ్ళటమే మంచిదిగా ఉద్దేశించాడతను.

వెంటనే బయలుదేరి వెళ్ళాడు. విశ్వాసరావు రాక చాకలిని ఆశ్చర్యపరిచింది.

"ఏం బాబూ యిలా వచ్చారు?"

"నీదగ్గర కెందుకు వస్తాంరా ... నీబోటి విశ్వాసంగల చాకలి దొరకటం నా అదృష్టం" అని నాందీ ప్రస్తావనగా అని వాణ్ణి ఉబ్బించి సంగతి చెప్పాడు విశ్వాసరావు.

వాడాశ్చర్యపోతూ అన్నాడు: "నాదగ్గర కెందు కొస్తాయ్ బాబూ" అని.

"అదేమిటి...ఎప్పుడూ జేబులు పరీక్షచేసి చూసేవాడవ్ ...నీదగ్గరకు రాక మరెవ్వరి దగ్గరకు వస్తాయ్? విడిచిన కోటు జేబులో ఆఫీసు కాగితం ఉంది. మా అఫీసరు కాగితం చూపించి సంతకం చేయించాలి"అని ఖంగారుపడ్డాడు విశ్వాసరావు.

"మీరేం తెలియనట్లుగా మాట్లాడుతున్నారు బాబూ! మీ జేబులు నన్ను తణిఖీచేయనివ్వటం లేదు అమ్మగారు. మీకంటేనా బాబూ! అమ్మగారేదో కాగితం యిందాకా తీశారు!" అని అన్నాడు చాకలి.

"నిన్ను తీయనివ్వలేదూ? ఆ సంగతి కనుక్కుంటానులే—"అని యింటికి బయలుదేరాడు విశ్వాసరావు.

* * *

కమల యేదో పనిచేసుకుంటూంది. హడావిడిగా విశ్వాసరావింటికి వచ్చి, "చాకలివాడిని జేబులు ముట్టుకోనివ్వటంలేదట, నువ్వే తణిఖీ చేస్తున్నావట"అని కోపాన్ని ప్రదర్శించాడు, అసలు విషయాన్ని మరచి.

"దొంగవెధవ-జేబుల్లోవి కాజేయటం వాడికి బాగా చేతవును. వాడు తమకు మనవిచేసుకొన్నాడేమిటి?"అంది కమల.

"నీ సోది వినటానికి టైంలేదు. ఒకటిమాత్రం నిజం—వాడు చాలా నమ్మకస్థుడు. పూతికపుల్ల పోయినా తెచ్చియిస్తాడు. సరేగాని, కాగితం తీశావట వాడు చెప్పాడు. అర్జంటుగా ఇయ్యి" అన్నాడు విశ్వాసరావు.

"చేతినిండాపనిఉంది, తీసుకోండి"అని పెట్టె తాళం యిచ్చింది కమల.

ఇంతవరకూ కమల పెట్టె విశ్వాసరావు తీసి పరీక్షించినది లేదు. కాగితంకోసం తీసిన ఆమె పెట్టెలో వెండి చెంబులో తన కాగితంతోబాటు, ఆ చెంబులో కొన్ని నోట్లూ, రూపాయిబిళ్ళలూ కన్పించాయి. కాగితం తీసుకుని, డబ్బు లెక్కపెట్టాడు, నూరు రూపాయల చిల్లర.

"ఏమే యీ డబ్బెక్కడిదీ?"అని ప్రశ్నించాడతను.

కమల వచ్చింది చూసింది. రహస్యం దాచలేకపోయింది. "మీజేబులు తణిఖీచేసి యీ ఆరు మాసాల్లో కూడబెట్టిన ధనం" అంది.

విశ్వాసరావుకిప్పుడంతా అర్థమయింది. చాకలి వింత ప్రవర్తనకుకారణం యిదన్నమాట. విశ్వాసరావుకు భార్యమీద హఠాత్తుగా చెప్పలేని అనురాగం పుట్టుకొచ్చింది. నవ్వుతూ అతడన్నాడు: నువ్వుగూడా జేబుదొంగవయ్యావన్నమాట!"అని.

"యజమాని నిద్రపోతూంటే-సొమ్ము మరోకళ్ళు కొట్టుకుపోతూంటే యేంచేసేది? నేను జేబుదొంగనే అయినా, సొమ్ము సొమ్ములోనే కల్సిందిగా. ఆ చాకలికి తణిఖీ చేయకుండా వేస్తే—ఆ సొమ్మంతా వాడికే దక్కేది. ఐనా ఫరవాలేదు. నే నిక్కడ కొచ్చేలోపునే ఆలా మరిగి ఉంటాడు. అందుకనే నే బట్టలు తణిఖీ చేయబోతూంటే ముట్టుకో వద్దనేవాడు"అంది కమల.

"అయితే ఫరవాలేదు. ఇద్దరిద్దరు మేధస్సుగల జేబుదొంగలు"—అంటూ నవ్వుతూ గడియారంవంక చూసుకొన్నాడు విశ్వాసరావు.

"అప్పుడే అరగంట ఆలస్యం!"—అంటూ అతడు వీధిలోకి వస్తూంటే నవ్వుతూ తలుపేసుకు పెట్టెవద్దకు వచ్చి వెండి చెంబు చూసుకుంది కమల! అందులో చిల్లర రూపాయలు మినహాగా నోట్లన్నీ గల్లంతు!

ఒకడు: మా ఆవిడ ఏవిషయం గురించైనా గంటలకొలదీ మాట్లాడగలదు.
ఇంకొకడు: మా ఆవిడకి అలా మాటాడడానికి అసలు విషయం ఏదీ అక్కర లేదు.